ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 28 అక్టోబరు 2025


శ్రీగిరిలో కార్తీక శోభ 6


జిల్లా ఖ్యాతిని చాటిచెప్పేలా కర్నూలు ఉత్సవ్ 6


కర్నూలులో చివరి మజిలీ 7

నిబంధనలకు పాతర



తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు

- ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్...
- మన రాష్ట్రం నుంచి ఆపరేషన్
- కర్నూలులోనూ ప్రైవేట్ ట్రావెల్స్ హవా
- రవాణా శాఖ అధికారుల దాడుల్లో పలు విషయాలు వెలుగులోకి

కాస్తంత సుఖంగా ప్రయాణించాలని ఎవరైనా అనుకుంటారు. పది రూపాయలు ఎక్కువ ఖర్చు చేయగలవాళ్లు అందుకు తగిన సౌకర్యాలు కోరుకుంటారు. ప్రైవేట్ ట్రావెల్స్ బిజినెస్ అక్కడ మొదలవుతుంది. ఆకర్షణీయమైన హంగులు ఉండే ట్రావెల్స్ వేగంగా గమ్యం చేర్చుతాయనే నమ్మకం కూడా తోడైంది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ట్రావెల్స్ యజమానులు బస్సులు నడిపి వ్యాపారం చేసుకుంటున్నారు. ఇటీవల కర్నూలు సమీపంలో జరిగిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం అనేక విషయాలను బయటపెట్టింది. ఈ సందర్భంగా కర్నూలు కేంద్రంగా నడిచే ట్రావెల్స్ బస్సుల లోగుట్టు ఇలా ఉంది...

కర్నూలు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ హవా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. కర్నూలులో వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం తర్వాత ప్రైవేట్ బస్సుల్లో ఎంత భద్రత ఉందనే కోణంలో చర్చ జరుగుతోంది. అసలు ఈ బస్సులకు ఎందుకింత డిమాండ్ ఉంది? బస్సులో ఉన్న సౌకర్యాలేమిటి? అనే కోణంలో సాధారణ ప్రజలు ఆరా తీస్తున్నారు. గత ఐదారేళ్లుగా ఈ ట్రావెల్స్ బిజినెస్ విపరీతంగా పెరిగింది. బెంగళూరు టూ హైదరాబాదు, అనంతపురం-కర్నూలు-విజయవాడ, ఆదోని- విజయవాడ, హైదరాబాదు-తిరుపతి ఇలా వందలాది ట్రావెల్ బస్సులు కర్నూలు మీదుగా ప్రయాణిస్తున్నాయి. రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు హైవేలో గమనిస్తే వీటి స్పీడ్ విపరీతంగా ఉంటుంది. పెద్ద పెద్ద బస్సులు కర్టన్లు, ఏసీ కూపేలతో, ఆకర్షణీయమైన బయట రంగులతో, బొమ్మలతో.. ఇలాంటి పెద్ద బస్సులో ఒక్కసారైనా ప్రయాణించాలని ఎవరైనా అనుకుంటారు. ఒక్కసారి ప్రయాణించాక.. అందులో ఉన్న సౌకర్యాలు, ఏసీ, కర్టన్లు, దుప్పటి, వాటర్‌బాటిళ్లకు ఆకర్షితులయ్యే అవకాశం ఉంది. దీంతో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ట్రావెల్స్ విపరీతంగా పెరిగాయి.



కేసుల వివరాలు ఇవి



- రికార్డులు లేనివి : 11
- ఎమర్జెన్సీ డోర్లు లేనివి : 01
- ఫైర్ సేఫ్టీ లేనివి : 9
- డ్రైవింగ్ లైసెన్సు లేని కేసు : 01
- ఓవర్ స్పీడ్ : 3
- నో రిఫ్లెక్టర్స్ : 4
- ఫిట్‌నెస్ లేని వాహనాలు : 2
- వాణిజ్య సరుకులు రవాణా వాహనాలపై : 33
- లైటింగ్ ఫోక్స్ అధికంగా ఉన్నవి : 54
- పర్మిట్లు లేని వాహనాలు : 8
- విండ్ షీల్డ్ లేనివి : 23
- ట్యాక్స్ చెల్లించని వాహనాలు : 15

ట్రావెల్ బస్సులపై గత పది నెలల్లో 186 కేసులు నమోదు చేశారు. రవాణా శాఖ అధికారులు భారీ ఎత్తున తనిఖీలు చేసి జరిమానా వేశారు.

నెల	కేసులు
జనవరి	05
మార్చి	17
మే	57
జూన్	10
జూలై	08
ఆగస్టు	21
సెప్టెంబరు	17
అక్టోబరు10కి	51
మొత్తం	186

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కడ రిజిస్ట్రేషన్ జరిగినా ఫిజికల్ వెరిఫికేషన్ ఉంటుంది. నిబంధనలకు అనుగుణంగా కంపెనీ మాన్యువల్‌లో రూపొందించి ఉంటేనే బస్సు రిజిస్ట్రేషన్ జరుగుతుంది. మరో వైపు అన్ని నిబంధనల ప్రకారం ఉంటే.. ఇక్కడ ట్రావెల్స్ నడపాలంటే ఒక్కో సీటుకు రూ.4వేల చొప్పున ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్యాక్స్ రూపంలో చెల్లించాలి.. ఇది ట్రావెల్స్ యజమాన్యానికి కొంత భారమే. దీంతో ఐదారేళ్ల కింద మోటారు వాహనాల చట్టంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని మార్పులను వీరు అడ్డం పెట్టుకున్నారు. గతంలో ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ జరిగితే.. ఆ రాష్ట్రం బార్డర్‌లో కొంతైనా ప్రయాణం చేయాలనే నిబంధన ఉండేది. అయితే.. సడలించిన నిబంధనలతో రిజిస్ట్రేషన్ జరిగిన రాష్ట్రంలో కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడైనా వాహనాలు నడుపుకోవచ్చనే కొన్ని మార్పులతో ట్రావెల్స్ యాజమాన్యం అతి తక్కువ ఫీజులు ఉండే కేంద్ర పాలిత ప్రాంతాలైన నాగాలాండ్, డామన్ డయ్యూలకు వెళ్తున్నారు. అక్కడ నామమాత్రంగానే ఫీజులు ఉంటాయి..

మిగతా 7వ పేజీలో

శ్రీశైలం అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి
- శ్రీశైలం బోర్డు సభ్యులుగా మరో ఇద్దరి ప్రమాణ స్వీకారం


క్షేత్రాభివృద్ధిపై వివరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

శ్రీశైలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో శ్రీశైల క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. సోమవారం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చంద్రావతి కల్యాణమండపంలో భరద్వాజ శర్మ, గంగమ్మ పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత మంత్రితోపాటు ముఖ్యమంత్రికి స్వయంగా ప్రత్యేక నివేదికలను అందజేశానని తెలిపారు. భవిష్యత్తులో క్షేత్ర విస్తరణ, ఆవశ్యకత, మాస్టర్ ప్లాన్ అమలుచేయడంలో ధర్మకర్తల పాలక మండలి సభ్యుల పాత్ర కీలకమన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన పాలక మండలి క్షేత్రాభివృద్ధికి అందించే సహకారం చారిత్రాత్మకమవుతుందన్నారు. పాలకమండలి సభ్యులు గంగమ్మ మాట్లాడుతూ గిరిజనులను గుర్తించి తనకు అవకాశం ఇప్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. బండిఆత్మకూరుకు చెందిన భరద్వాజశర్మ మాట్లాడుతూ శ్రీశైల ఆదిదంపతులకు సేవ చేసుకునే భాగ్యాన్ని పాలక మండలి సభ్యునిగా మూడోసారి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు ఆకుల శ్రీనివాసులు, ట్రస్‌బోర్డు సభ్యుడు అనిల్‌కుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: ఎస్పీ


సమస్యలు వింటున్న ఎస్పీ

నంద్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై విచారించి త్వరగా పరిష్కరించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయ వద్దని ఎస్పీ సునీల్ షెరాన్ పోలీసు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్ట పరిధిలో వారికి న్యాయం జరిగేలా చేయాలన్నారు. 140 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేయాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు ఉంటే జిల్లా కేంద్రానికి రావాలని ఎస్పీ సూచించారు. అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తామని మోసం, ఆస్తి తగాదాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ యుగంధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్ష

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ప్రజాభిప్రాయ సేకరణపై అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన రెవెన్యూ, సర్వే, గృహ నిర్మాణం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, పింఛన్ పంపిణీ, కాలుష్య నియంత్రణ, ఆరోగ్య సేవలు తదితర విభాగాల్లో ప్రజాభిప్రాయ సేకరణలో రాష్ట్ర స్థాయిలో అసంతృప్తికర స్పందనలు నమోదయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో సరిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 13 సచివాలయాలు ప్రజాభిప్రాయ సేకరణలలో దిగువ స్థానంలో ఉన్నాయని, భవిష్యత్తులో ఇలా కొనసాగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే డోన్, బేతంచెర్ల, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్యక్రమాలు అసంతృప్తికరంగా ఉన్నట్లు వెల్లడి అయిందన్నారు. జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'రామ్‌కో' బాధితులకు న్యాయం జరగాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

కొలిమిగుండ్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రామ్‌కో పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులతో పాటు, పరిశ్రమ వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య స్పష్టం చేశారు. సోమవారం కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గుహల ఆవరణలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి కౌన్సిల్ సభ్యుల శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి హోదాలో తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన ఈశ్వరయ్యను సీపీఐ నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో కార్మికులకు జీవనాధారమైన నాపరాళ్ల పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యను మంత్రి బీసీ జనార్ధనరెడ్డి చొరవ తీసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ రాయల్టీ వసూలు చేసే బాధ్యత ప్రైవేటుకు అప్పగించడంతో నాపరాళ్ల పరిశ్రమ పూర్తిగా నిలిచిపోయేలా ఉందన్నారు. దీంతో యజమాన్యాలు, అటు కార్మికుల వర్గాల్లో వేలాది కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, రంగనాయుడు, భీమలింగప్ప, బాబాఫక్రుద్దీన్, రాధాకృష్ణ, రఘురామమూర్తి, పుల్లయ్య, సూరి, వినయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కల్వకుర్తి-నంద్యాల రహదారి పనులు

- డీఈ జగదీశ్వర గుప్తా


మాట్లాడుతున్న డీఈ జగదీశ్వర గుప్తా

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కల్వకుర్తి-నంద్యాల ఎన్‌హెచ్-167కే రహదారి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆ శాఖ డీఈ జగదీశ్వర గుప్తా తెలిపారు. సోమవారం డీఈ కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణి, ఏఈ రవికాంత్, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ జయకుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 10 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కేసీవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ సంస్థ చేపడుతోందన్నారు. ఈ రహదారి నిర్మాణం కోసం 62.571 కిలోమీటర్ల పరిధిలో 620.289 ఎకరాలు అవసరం కాగా, అందులో 154.67 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. 465.67 ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 334.446 ఎకరాలకు గానూ 79 శాతం రైతులకు పరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా 21 శాతం మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉండగా.. ఒకరు సాగులో ఉన్నారనీ, మరొకరు ఆన్‌లైన్‌లో ఉండటం వల్ల నిర్మాణ పనులకు కొంత జాప్యం జరుగుతోందని చెప్పారు. ఏదీ ఏమైనా వర్షాలు పూర్తిగా తగ్గిన వెంటనే కల్వకుర్తి నుంచి కొత్తపల్లి, ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, నంద్యాల మండలాల మీదుగా నిర్మాణ పనులు చేపడుతామన్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన మెటీరియల్ సిద్ధంగా ఉంచినట్లు డీఈ జగదీశ్వర గుప్తా తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై దాడులు

- మూడో రోజులుగా జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు
- 24 కేసులు నమోదు.. 1.45 లక్షలు జరిమానా



నంద్యాలలో తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

నంద్యాల టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు చేస్తున్నట్లు నంద్యాల జిల్లా రవాణాశాఖ అధికారి శివారెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి తనిఖీలు చేసి 24 కేసులు, రూ. 1.45 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే ఒక బస్సు సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రతి బస్సు యాజమాన్యం కూడా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు, ఏఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.72కోట్లు గోల్‌మాల్

- చేతివాటం ప్రదర్శించిన 'వెలుగు' సిబ్బంది
- మహిళా సమాఖ్య నిర్వహణే కష్టం
- నెల రోజుల క్రితమే అకౌంటెంట్ తొలగింపు



రుద్రవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రమదేవి మహిళా సమాఖ్యలో రూ.2.72కోట్ల నిధుల గోల్‌మాల్ జరిగింది. మహిళాభివృద్ధే లక్ష్యమని ప్రభుత్వాలు పనిచేస్తే అప్పట్లో పనిచేసిన సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. నిధులు గోల్‌మాల్ చేసి మండల సమాఖ్యను ఖాళీ చేశారు. సమాఖ్య నిర్వహణే కష్టంగా మారింది. మండలంలో 1,110 పొదుపు సంఘాలున్నాయి. వాటిలో 11,110 మంది పొదుపు సభ్యులున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీఐఎస్ (కమ్యూనిటీ ఇన్వెస్టిమెంట్ ఫండ్) పథకం నిధులు మంజూరు చేసి రుణాలిచ్చారు. అప్పట్లో పనిచేసిన సిబ్బంది అవినీతి పర్వానికి తెర లేపారు.

ఇరవై ఏళ్లక్రితం రూ.80లక్షలు మంజూరు

ఇరవై ఏళ్ల క్రితం జిల్లాలో ప్రతి మండల సమాఖ్యకు రూ.20లక్షలు నిధులు మంజూరు చేశారు. రుద్రవరం మండల సమాఖ్యకు రూ.80లక్షల సీఐఎఫ్ కింద నిధులు మంజూరు చేశారు. ఈ నిధులను గ్రామైక్య సంఘాలకు రుణాల రూపంలో మంజూరు చేయాల్సి ఉంది. రుద్రవరం మండలంలో ఆ నిధులు ఖాళీ చేశారు. మంజూరైన రూ.80లక్షలు, వాటికి నెలకు రూ.80వేలు వడ్డీ రూపంలో 240 నెలలకు రూ.1.96 కోట్లు వడ్డీ. మొత్తం రూ.2.72 కోట్లు ఏమయ్యాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పొదుపు సంఘాల మహిళలతో..

వెలుగు కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి అనే మహిళను పొదుపు సంఘాల మహిళలతో తీర్మానం చేసి తొలగించారు. ఇప్పటికీ అకౌంటెంట్ వెలుగు కార్యాలయంలో ఉన్న బీరువా తాళాలు అప్పగించలేదు. అకౌంటెంట్ నుంచి తాళాలు ఎందుకు స్వాధీనం చేసుకోలేదన్న దానిపై విమర్శలున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రుద్రవరం మండల సమాఖ్య విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సెప్టెంబరు 26వతేదీన మండల సమాఖ్య తీర్మానం చేసి అకౌంటెంట్ లక్ష్మీదేవిని తొలగించాం. బీరువా తాళాలు, రికార్డులు అకౌంటెంట్ ఇంతవరకు అప్పగించలేదు.

- వసంతకుమారి, ఏపీఎం, వెలుగు, రుద్రవరం

అప్రమత్తంగా ఉండండి

- మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం
- కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావంతో మూడు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, భద్రతా చర్యలు చేపట్టేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం తుఫాన్ నేపథ్యంలో భద్రతా చర్యలపై కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొంథా తుఫాను కాకినాడ-విశాఖపట్నం మధ్య తీరం దాటుతున్నదని, దాని ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు నంద్యాల జిల్లాపైన కూడా ఉండే అవకాశముందన్నారు. అందువల్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉల్లి, మొక్కజొన్న, టమోటా రైతులు పంటకోతను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 30 శాతం మొక్కజొన్న కోత జరగగా, అధిక తేమ కారణంగా పంటలకు తక్కువ ధరలు పడే అవకాశముందని వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం కలెక్టర్‌తో పాటు జేసీ కె.కార్తీక్, డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండు వారాల్లో రీ ఓపెన్ అయిన దరఖాస్తులు 481 ఉన్నాయని చెప్పారు. ప్రధానంగా రెవెన్యూ, సర్వే విభాగాల్లో అధికంగా ఉన్నాయని, వెంటనే క్లియర్ చేయాలని తహసీల్దార్లు, ఆర్డీవోలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ స్వీకరణ 39 శాతం మాత్రమే ఉందని, 50 శాతానికి పెంచాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్‌పై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మొత్తం 282 అర్జీలు వచ్చాయని తెలిపారు.

శ్రీగిరిలో కార్తీక శోభ



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



క్యూలైన్లలో భక్తులతో మాట్లాడుతున్న ఈవో



ఆకాశదీపం పూజల్లో పాల్గొన్న ఈవో శ్రీనివాసరావు



విద్యుద్దీపకాంతుల్లో కోనేరు



- తొలి సోమవారం శ్రీశైలంలో భక్తుల రద్దీ
- వైభవంగా లక్ష దీపోత్సవం

శ్రీశైలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం కార్తీకశోభను సంతరించుకుంది. పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాస తొలి సోమవారం కావడంతో శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి పుష్పాలతో అలంకరించిన వేదికపై ఉంచారు. అనంతరం దశవిధ హారతులను ఇచ్చారు. పుష్కరిణి నాలుగువైపులా లక్షదీపోత్సవాన్ని నిర్వహించి శివసేవకులు భక్తులు దీపాలు వెలిగించారు. కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలను చేసుకొని కృష్ణమ్మకు దీపాలను వెలిగించి పసుపు కుంకుమలతో సారె సమర్పించారు. పరమశివుని దర్శించుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్యూలైన్‌ల్లో బారులుదీరారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. కార్తీకమాసాంతం శని, ఆది, సోమవారాలతో పాటు ప్రభుత్వ సెలవు రోజులు, ఏకాదశి, పౌర్ణమి రోజుల్లో భక్తులందరికీ అలంకార దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. మాసాంతం గర్భాలయ అభిషేకాలు, సామూహికాభిషేకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. క్యూలైన్లలో భక్తులకు నిరంతరం అల్పాహారం, మంచినీరు అందిస్తున్నట్లు ఆలయ పీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. రద్దీకి అనుగుణంగా యాత్రికులకు సరిపడా లడ్డూ ప్రసాదాలను 10 కౌంటర్లలో అందిస్తున్నారు. దీపాలను వెలిగించుకునేందుకు వీలుగా ఆలయ గంగాధర మండపం, ఉత్తర మాడవీధుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో సర్వ దర్శనానికి వెళ్తున్న భక్తులతో ఈవో శ్రీనివాసరావు, ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.



పాతాళగంగలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



లక్ష దీపోత్సవానికి ఉత్సవమూర్తులు

యాగంటిలో పోటెత్తిన భక్తులు



యాగంటి గాలిగోపురం సమీపంలోని ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బనగానపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా యాగంటి క్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. యాగంటి క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానమాచరించి, యాగంటి బసవయ్యను, ఉమామహేశ్వరస్వామి, వీరభద్రస్వామి, వెంకటేశ్వర గవి, గణపతిని దర్శించుకున్నారు. ఉమామహేశ్వర స్వామికి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి, మహానివేదన, ఉచిత ప్రసాద వితరణ, పల్లకీ సేవోత్సవాలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండు రంగారెడ్డి, యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. యాగంటి గోపురం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీ ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థ, శ్రీ ఉమామహేశ్వర రెడ్ల అన్నదాన సంస్థ, ఆర్యవైశ్య అన్నదాన సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పట్టణంలోని నేలమఠం, చింతమానుమఠం, రవ్వలకొండ, పసుపల గ్రామ సమీపంలో వెలసిన గుండం మల్లికార్జునస్వామి ఆలయం, రామతీర్థంలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి ఆలయం, బనగానపల్లె మండలంలో వెలిసిన శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు.



యాగంటి బసవయ్యకు పూజలు చేస్తున్న భక్తులు

మల్లన్న సన్నిధిలో మంత్రి బాల వీరాంజనేయస్వామి



మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

శ్రీశైలం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వీరికి ఈవో శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలు పల్లించి తీర్థప్రసాదాలతో పాటు పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

బస్సు ప్రమాదంపై జగన్ తప్పుడు ప్రచారం

'కుడా' చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పరదాల చాటున తిరిగి.. విచ్చలవిడిగా ప్రజల సొమ్ము దోచేసి కూటమి పాలనను తప్పుపట్టడం ఎంత వరకు సమంజసమని జగన్‌ను ప్రశ్నించారు. బస్సు ప్రమాదం జరిగిన తర్వాత ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టిందని, బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. మీ పాలనలో ఒక్కరికైనా సాయం చేశారని అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత వివిధ రకాల పన్నులు విధించి ప్రజలు ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు తన అనుభవంతో పాలన అందిస్తుంటే చూసి జీర్ణించుకోలేక, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. జగన్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

జిల్లా ఖ్యాతిని చాటిచెప్పేలా కర్నూలు ఉత్సవ్

- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి చోటుకు కృషి
- టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, వినూత్నమైన సంస్కృతి సంప్రదాయాలకు వేదికగా ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లా నేపథ్యాన్ని భావితరాలకు అందించే దిశగా వారం రోజుల పాటూ 'కర్నూలు ఉత్సవ్ -2025' పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య అన్నారు. సోమవారం టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కర్నూలు ఉత్సవ్-2025 కార్యక్రమాల బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా టీజీవీ కళాక్షేత్రంలో ఏడు రోజుల పాటూ కర్నూలు ఉత్సవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన శాస్త్రీయ, జానపద కళాకారుల ప్రదర్శనలు, సాహితీవేత్తలతో కవి సమ్మేళనాలు, కవితాగోష్టులు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఏడు రోజుల పాటూ నిత్యం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకాంకిక నాటక పోటీలు ఉంటాయన్నారు. వారంలో మొత్తం 40 నాటకాలను 120 మంది కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు. ఏడు రోజుల పాటు ప్రతిరోజూ నిర్విరామంగా 12 గంటల పాటూ కళాప్రదర్శనలు అరుదైన విషయంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేయబోతోందని తెలిపారు. ఇదివరకు టీజీవీ కళాక్షేత్రం రెండుసార్లు ఈ రికార్డులను నమోదు చేసుకుందని గుర్తు చేశారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

వెయ్యిమందితో ర్యాలీ : నవంబరు ఒకటిన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు వెయ్యి మంది కవులు, కళాకారులు, యువతతో భారీ ర్యాలీ ఉంటుందని, ఈ ర్యాలీని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభిస్తారని పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల చాయాచిత్ర ప్రదర్శన కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తున్నామని, ఏడు రోజుల పాటూ ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు సత్కారం ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాల్లో కళలు, సాహిత్యం, నాటకరంగం, సంగీతం, గాత్రం, మిమిక్రీ, ఇంద్రజాలం, ఆహార్యం, సామాజిక సేవల్లో రాణిస్తున్న 250 మందిని సత్కరించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కళాకారులు పి. రాజారత్నం, వీవీ గురుమూర్తి, జీవీ శ్రీనివాసరెడ్డి, చల్లా నవీన్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మార్ఫింగ్ ఫొటోలతో అసత్య ప్రచారం

- బస్సు ప్రమాదం నేపథ్యంలో బెల్ట్‌షాపుల వల్లే అంటూ కల్పితాలు సృష్టిస్తున్నారు
- ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు



కర్నూలు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బెల్టు షాపు పేరుతో మార్ఫింగ్ ఫొటోలతో తప్పుడు ప్రచారం తగదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు అన్నారు. నగరంలోని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద స్థలానికి, మద్యం దుకాణానికి 3 కిలోమీటర్ల దూరం ఉందని చెప్పారు. అయితే ఏమీ లేని చోట.. బెల్టుషాపు ఉందని.. అందులో కొన్నారని ఫొటోలు మార్ఫింగ్ చేసి ప్రచారం చేయడాన్ని ఖండించారు. మద్యం దుకాణంలో మద్యం కొన్న విషయం వాస్తవమేనని, సీసీ ఫుటేజీలను మీడియాకు కూడా విడుదల చేశామని చెప్పారు. తప్పుడు కథలు, కల్పితాలు సృష్టించి ఈ ఘటనను పక్కదారి పట్టించేందుకు కొందరు ప్రయత్నించడం సరికాదన్నారు. బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో శివశంకర్, ఎర్రిస్వామి మద్యం తాగారన్న విషయంలో కేసులు, విచారణ జరుగుతున్న సమయంలో ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఓ ఉత్తరం రాస్తావా?

- తపాలా శాఖ ఆధ్వర్యంలో ఉత్తరాల పోటీలు
- వయో పరిమితి లేకుండా అందరూ అర్హులే
- డిసెంబరు 8 వరకు దరఖాస్తుల స్వీకరణ





కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ యుగంలో పోస్టుకార్డు కనుమరుగైంది. అయితే మారిన కాలానికి అనుగుణంగా తపాలా శాఖ అప్‌గ్రేడ్ అవుతోంది. ఈ క్రమంలో తపాలా సేవలు, ఆ కాలం నాటి పోస్టుకార్డుల గురించి విద్యార్థులకు, ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఏటా సరికొత్త అంశంతో పోటీలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది లెటర్ టూ మై రోల్ మోడల్ అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయస్థాయిలో ధాయ్ ఆఖర్ పేరుతో ఈ పోటీలు జరుపుతోంది. దీనిలో భాగంగా ప్రియమైన నువ్వు..ఓ ఉత్తరం పంపు అంటూ ప్రోత్సహిస్తూ పోటీలు పెట్టింది.

బహుమతులు ఇలా..!

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (12 మందికి మించకుండా) నగదు బహుమతి అందజేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారిని జాతీయస్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ స్థానానికి రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు ప్రదానం చేస్తారు.

అర్హులు ఎవరంటే..!

ఉత్తరం రాసే వారు భారత పౌరులై ఉండాలి. వయో పరిమితి లేదు. 18 ఏళ్లలోపు ఒక కేటగిరి, 18 ఏళ్ల పైబడిన వారిని మరో కేటగిరీగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. చేతితో రాసిన వ్యాసాన్ని మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌ల్యాండ్ లెటర్ 500 పదాలకు మించకుండా రాయాలి. వీటిని పాతబస్టాండు సమీపంలోని సూపరింటెండెంట్ కార్యాలయం, కర్నూలు-518001 చిరునామాకు, లేదా సమీపంలోని తపాలా కార్యాలయాలకు డిసెంబరు 8వ తేదీలోగా పంపాలి.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులను పాఠశాల యాజమాన్యాలు ప్రోత్సహించాలి. తపాలాశాఖ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి.

-జి. జనార్దన్‌రెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్, కర్నూలు

అమ్ముకోక తప్పదా?

- రైతులను వెంటాడుతున్న తుఫాన్ భయం
- దళారులు అడిగిన ధరకే మొక్కజొన్న విక్రయాలు



చాగలమర్రిలో సర్వీసు రహదారిలో మొక్కజొన్నను ఆరబెట్టుకుంటున్న రైతులు

చాగలమర్రి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏ రూపంలో ప్రకృతి ప్రకోపించినా రైతులకు కష్టాలు తప్పవు. నష్టాలు తప్పవు. కొద్ది రోజులుగా వెంటాడుతున్న తుఫాను వల్ల మొక్కజొన్న రైతులు దారుణంగా నష్టపోయారు. మొంథా తుఫాను వల్ల చేతికి వచ్చిన పంటను నష్టానికి తెగనమ్ముకోవాల్సి వస్తోంది. 10 రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. తుఫాను మరిన్ని రోజులు వెంటాడుతుందని కూడా అనిపిస్తోంది. ఈ పరిస్థితిల్లో రోడ్లమీద ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలను ఎట్లా కాపాడుకోవాలో రైతులకు తెలియడం లేదు. వర్షాలకు పంట దిగుబడి తడిసిపోతే మరింత నష్టం వస్తుందని దళారులు ఎంతకు అడిగితే అంతకు రెండు రోజులుగా తెగనమ్ముకొని నష్టపోతున్నారు. మరీ కనిష్ఠ ధరకు అమ్ముకుంటే పెట్టుబడి ఖర్చు కూడా రాదని తెలుసు. అయినా తప్పడం లేదు. వ్యాపారులు, దళారులు ఎంత ధర చెబితే అంతకే మారు మాట లేకుండా విక్రయిస్తున్నారు. మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, జ్ఞానాపురం, మూడురాళ్లపల్లె, పెద్దబోదనం, చాగలమర్రి గ్రామాలతో పాటు రైతులు 10 రోజులుగా వర్షానికి అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు పట్టలు కప్పడం, తిరిగి ఆరబెట్టడం ఇదే తంతుగా మారింది. కొందరు రైతులు తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌తో గృహాలకు తరలించుకుంటున్నారు. రైతుల్లో నెలకొన్న ఆందోళనను గమనించిన కొందరు వ్యాపారులు తక్కువ ధరకు కొనేందుకు సిద్ధమయ్యారు. సోమవారం కొద్దిగా తెరపి ఇవ్వడంతో తక్కువ ధర చెల్లించి మొక్కజొన్న సొంతం చేసుకుంటున్నారు. క్వింటంకు రూ.1,600 నుంచి రూ.1,900 దాక ధర చెల్లించి కొనుగోలు చేపట్టారు. రైతులు చేసేది లేక తక్కువ ధరకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరి కొందరు రైతులు మనసు ఒప్పక రోడ్ల మీద అలాగే ఉంచారు. చాగలమర్రి సర్వీసు రహదారిపై మొక్కజొన్నను ఆరబెట్టారు. వర్షం భయంతో కుప్పలు చేసి వాటిపై పట్టలు కప్పి ఉంచారు. ఇట్లా తక్కువ ధరకే తాము పంట దిగుబడి అమ్ముకోక తప్పదా? అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

తుఫాన్‌తో రైతులకు కన్నీటి కష్టాలు



మొంథా తుఫాన్‌తో దెబ్బతిన్న పత్తి పంట

ఆలూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అకాల వర్షాల వల్ల పత్తి, మిరప, ఉల్లి పంటల్లో మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కురుకుంద, ముద్దనగేరి, మనేకుర్తి, పెద్దహోతూరు, హత్తిబెళగల్, మూసానహళ్లి, మొలగవల్లి, కమ్మరచేడు, అరికెర తదితర గ్రామాల్లో సోమవారం మొంథా తుఫాన్ వల్ల పంటల్లో నీరు నిల్వ చేరి అపార నష్టం వాటిల్లింది. పత్తి, ఉల్లి పంటలు మొలకలు రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల క్రితం పప్పుశనగ విత్తనం సాగు చేశారు. అయితే తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కురుకుందలో మిరప పంటలో చేరిన వర్షపునీరు

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


మహబూబ్ పీర (ఫైల్)

ఉయ్యాలవాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందారు. వివరాలివీ.. ఉయ్యాలవాడ మండల కేంద్రానికి చెందిన మహబూబ్ పీర(48) ఇంజేడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మహబూబ్ పీర ఈనెల 24న రాత్రి తన మిత్రులతో కలిసి బెంగళూరుకు వెళ్లారు. అయితే అక్కడ ఈనెల 26న మధ్యాహ్నం గుండెపోటు రావటంతో ఆయన స్నేహితులు ఆయనను వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

నందవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని హలహర్వి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రత్నమ్మ(65) మృతిచెందారు. వివరాలివీ.. రత్నమ్మను సోమవారం ఉదయం ఓ వాహనం ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. వాహనాన్ని హెడ్ కానిస్టేబుల్ కోదండ రామిరెడ్డి, కానిస్టేబుల్ భాస్కర్ స్టేషన్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నూర్పిడి యంత్రం బోల్తా పడి మహిళ..

- యువతికి గాయాలు

పత్తికొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నూర్పిడి యంత్రం కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన పత్తికొండ మండలం పందికోన గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలివీ.. గ్రామానికి చెందిన తలారి సరస్వతి, వాసవితో పాటు మరికొందరు కూలీలు నూర్పిడి యంత్రంపై పనికి వెళ్తున్నారు. ఆ యంత్రం అదుపు తప్పి బోల్తా పడడంతో యంత్రం కిందపడి తీవ్రగాయాలతో తలారి సరస్వతి ((45)తో పాటు వాసవి అనే యువతి గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం పత్తికొండ ఆసుపత్రికి తరలించగా సరస్వతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాలపాలైన వాసవి ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలి

- రియల్ ఎస్టేట్ వ్యాపారి చేతిలో మోసపోయాం
- పత్తికొండ ఆర్డీవోకు బాధితుల మొర


రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న బాధితులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చేతిలో మోసపోయామని, న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం పత్తికొండలో ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలోని ఆర్.ఎస్.పెండేకల్ గ్రామంలో 2016లో సర్వే నెంబర్ 509బీ1, 509బీ2లో 1.02 ఎకరాల స్థలంలో వెంచర్ వేసి ఎద్దులదొడ్డి రామచంద్రుడు ప్రచారం చేసుకున్నారని, దీంతో చుట్టుపక్కల గ్రామాలైన ఇందిరంపల్లి, చందోలి, పెద్దహూజల్ల తదితర గ్రామాలకు చెందిన 19 మంది ఒక్కొక్కరు రూ.90 వేలు వెచ్చించి 2 సెంట్లు ప్రకారం స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ సర్వే నంబర్ పరిధిలోని భూమి రైల్వేశాఖ పరిధిలోకి వెళ్లిపోయిందని అధికారులు చెబుతున్నారని, దీనిపై వ్యాపారిని నిలదీస్తే చేతులెత్తేశాడని చెప్పారు.

2016లో రూ.90 వేలతో రెండు సెంట్ల స్థలం కొన్నా



ఆర్.ఎస్.పెండేకల్‌లో 2016లో రూ.90 వేలు వెచ్చించి 2 సెంట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారి ద్వారా కొనుగోలు చేశా. స్థలానికి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నా. స్థలం కోసం వెళ్తే మీ స్థలం లేదంటూ రైల్వేశాఖ అధికారులు చెప్పారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి. **- కృష్ణ, బాధితుడు, పెద్దహూజర్ల**

వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి



మాకు మాయ మాటలు చెప్పి స్థలాలను అమ్మి మోసం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి. మాకు అమ్మిన స్థలానికి ఆన్‌లైన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరు ఉండడంతో రైల్వేశాఖ ఇచ్చిన నష్టపరిహారం వ్యాపారి అకౌంట్‌లో జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. వ్యాపారి మాకు స్థలమైనా చూపించాలి. డబ్బులైనా తిరిగి ఇవ్వాలి.**- సుధాకర్, బాధితుడు, ఇందిరాంపల్లి**

శ్రీశైలంలో అన్యమత ప్రార్థనలు

భద్రతా లోపాలే కారణమంటున్న భక్తులు

శ్రీశైలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో అన్యమత ప్రార్థనలు చేసిన ఘటన సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో నంది సర్కిల్ సిద్దరామప్ప కాంప్లెక్స్ సమీపంలో టూరిస్టు బస్సులో అనంతపురానికి చెందిన ఓ వ్యక్తి నమాజు చేస్తున్న వీడియోను భక్తులు తీసి దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆలయ ముఖ్య భద్రతా అధికారి శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షేత్ర పరిధిలో అన్యమత ప్రార్థనలు చేయకూడదని తెలియపరిచారు. అనంతరం ఆ వ్యక్తితో పాటు ఏపీ29 టీబీ 5200 నంబరు గల బస్సును స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పవిత్రమైన హిందూ క్షేత్రంలో అన్యమతస్థుల ప్రార్థనలు, ప్రచారాలకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ సంభవించడం ఆలయ భద్రత నిర్లక్ష్యానికి నిదర్శనమవుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టోల్ గేట్ వద్ద తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది వాహనాలపై గల అన్యమత చిహ్నాలు, వాక్యాలు కనిపించకుండా ఓం నమఃశివాయ స్టిక్కర్లు వేసి క్షేత్ర ప్రవేశానికి అనుమతి ఇస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

శ్రీశైల క్షేత్ర పరిధిలో హిందూ దేవదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం అన్యమత ప్రచారం, అన్యమత ప్రార్థనలు కూడా చేయకూడదు. అవగాహన కల్పిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత క్షేత్ర అధికారులపై ఉంది. ఎండోమెంట్ యాక్ట్ జీవోఎంఎస్ నెంబర్ 7473087-2007 ప్రకారం క్షేత్ర పరిధిలో అన్యమత వస్త్రధారణ, ప్రార్థనలు, ప్రచారాలు చేయడం పూర్తిగా నిషిద్ధం. ఈ విషయంపై యాత్రికులకు అవగాహన కల్పిస్తూ క్షేత్ర ప్రవేశం చేసే ముఖద్వారం మొదలకుని పరివార ఆలయాలు, శిఖరేశ్వర ఆలయ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, అవుటర్‌రింగ్ రోడ్డు, సత్ర సముదాయాలు, పార్కింగ్ ప్రాంతాల్లో నిబంధనల వివరాలతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలు హిందూ ధార్మిక సంస్థలు దేవస్థానం అధికారులను కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సిరి ఆదేశించారు. సోమవారం హౌసింగ్, పీజీఆర్ఎస్ అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల వివరాలు పంపాలని సూచించారు.

పోలీసుల్లో మార్పు తీసుకురండి

- లాయర్లు, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు
- పోలీసుల పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతోంది
- చలో కర్నూలుకు కదిలిన ఆదోని న్యాయవాదులు
- ఎస్పీకి ఫిర్యాదు.. కలెక్టరేట్ వద్ద ధర్నా


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఆదోని బార్ అసోసియేషన్ న్యాయవాదులు

కర్నూలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్‌లో కొందరు పోలీసు అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆదోని పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌కు ఓ కేసు విషయంలో వెళ్లిన న్యాయవాదుల పట్ల అక్కడి సీఐ అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించిన తీరుకు నిరసనగా ఆదోని బార్ అసోసియేషన్ చలో కర్నూలు కార్యక్రమానికి పిలుపు ఇచ్చింది. అసోషియేషన్ అధ్యక్షుడు వి. శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఎల్‌కే జీవన్‌సింగ్ ఆధ్వర్యంలో ఎస్పీని కలిశారు. వివిధ పనులు, కేసులు విషయంలో పోలీస్ స్టేషన్లకు వెళ్లే న్యాయవాదులు, సామాన్య ప్రజల పట్ల కనీస గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని, దీనివల్ల పోలీసు శాఖ విశ్వసనీయత దెబ్బతింటుందని వివరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విధానం తీసుకురావాలని, న్యాయవాదులు, సామాన్య ప్రజల గౌరవ భావంతో చూడాలని కోరారు. దీనికి ఎస్పీ సానుకూలంగా స్పందించారని బార్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అక్కడి నుంచి వారు కలెక్టరేట్ చేరుకొని ధర్నా చేశారు. ఆదోని బార్ అసోసియేషన్ చేపట్టిన చలో కర్నూలు నిరసన కార్యక్రమానికి ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ బార్ అసోసియేషన్లు మద్దతు పలుకుతూ ధర్నాలో పాల్గొన్నారు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ పి.రాజారత్నం, సీనియర్ న్యాయవాదులు జీవీ దేశాయ్, రామిరెడ్డి, విరుపాక్షిరెడ్డి, కేజీ వెంకటేష్, చంద్రయ్య, తబ్రేజ్ పాల్గొన్నారు.

ఆదోని టూటౌన్ సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

కర్నూలు లీగల్: ఆదోనిలో సీనియర్ న్యాయవాది వెంకటేశ్‌పై ఆదోని టూటౌన్ సీఐ దురుసుగా ప్రవర్తించి అవమానించారని ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కర్నూలు న్యాయవాదులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హరినాథ్ చౌదరి, బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవి గువేరా ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎస్పీకి వినతి పత్రాన్ని అందజేశారు. న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, పోలీసు అధికారులే న్యాయవాదులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి తలవంపు తెచ్చేలా ఉందన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకుని వచ్చి వారికి భద్రతను కల్పించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో న్యాయవాదులు రవికాంత్ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, రవికాంత్ ప్రసాద్, మోహన్‌బాబు, ఎం.సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

కర్నూలులో చివరి మజిలీ

- తమిళనాడు వాసికి అంత్యక్రియలు
- పూర్తయిన మృతదేహాల అప్పగింత


ప్రశాంత్ రాజన్ మృతదేహంపై పడి ఏడుస్తున్న తండ్రి


ప్రశాంత్‌రాజన్ (ఫైల్)

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం ధర్మపురం జిల్లా జితన్‌హల్లికి చెందిన ప్రశాంత్ రాజన్(29) కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. అతడి మృతదేహానికి సోమవారం ఉదయం కర్నూలులోని జమ్మిచెట్టు వద్ద ఉన్న ఎలక్ట్రికల్ కిమాటోరియంలో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. కర్నూలు నుంచి సొంత ప్రాంతమైన తమిళనాడుకు తీసుకెళ్లడం కష్టమని భావించి తండ్రి ఇక్కడే అంత్యక్రియలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో స్థానికంగానే అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు కర్నూలు జీజీహెచ్‌లోని మార్చురీ నుంచి మహాప్రస్థానం వాహనంలో ప్రశాంత్ రాజన్ మృతదేహాన్ని తీసుకెళ్లారు. జమ్మిచెట్టు వద్ద ఎలక్ట్రికల్ కిమాటోరియంలో బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చివరి చూపు లేకుండా ఏ మాత్రం సంబంధం లేని కర్నూలులో ఖననం చేయాల్సి వస్తోందని తండ్రి రాజన్ కన్నీరు మున్నీరయ్యారు. ప్రశాంత్ రాజన్ అంత్యక్రియలతో బస్సు అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన అందరి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించే ప్రక్రియ పూర్తయిందని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రాత్రి 8.45 గంటలకు 18 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించామని, బీహార్‌కు చెందిన వ్యక్తి మృతదేహాన్ని కూడా ఎలక్ట్రికల్ కిమాటోరియంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు.

16న కమ్మ కులస్థుల కార్తీక వన భోజనాలు


కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నవంబరు 16న కమ్మ కులస్థుల కార్తీక వనభోజన మహోత్సవం ఏర్పాటు చేసినట్లు జిల్లా కమ్మసంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కమ్మ కృష్ణమోహన్, పెనికలపాటి రాజశేఖర్ తెలిపారు. సోమవారం నగరంలోని ఎ.క్యాంపు మాంటిస్సోరి హైస్కూల్ ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో కార్తీక వనభోజన మహోత్సవ ప్రచార కరపత్రాలు సంఘ ప్రతినిధులతో కలిసి వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీక మాసంలో జిల్లా కమ్మసంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా నవంబరు 16న నందికొట్కూరు రోడ్డులోని కమ్మ సంఘ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కమ్మ కులస్థులంతా ఈ వనభోజన మహోత్సవానికి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సాంస్కృతిక, సంప్రదాయ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్మసంఘం కార్యవర్గ సభ్యులు జంపాల మధు, కూసుపాటి బాబ్జి, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, గోపి, అమిత్, కరుణాకర్ చౌదరి, మీనాక్షినాయుడు, శేఖర్, పి.నాగేశ్వరరావు, గుమ్మల్ల విజయశేఖర్, చంద్రశేఖర్, రంగయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర

(5వ పేజీ తరువాయి)



కర్నూలులో ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు జిల్లాలో మొత్తం 15 ట్రావెల్స్ బస్సులు ఉన్నాయి. వీటిలో ఏపీ రిజిస్ట్రేషన్‌తో 12 బస్సులు ఉన్నాయి. అందులో 11 ఆదోని రిజిస్ట్రేషన్‌తో ఉండగా.. ఒకటి కడప రిజిస్ట్రేషన్‌తో ఉంది. మూడు ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో కర్నూలు కేంద్రంగా ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. రెండు నాగాలాండ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా.. మరో బస్సు అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కానీ హైదరాబాదు, బెంగుళూరు, హైదరాబాదు- తిరుపతి మధ్య తిరుగుతు న్నాయి. షబానా ట్రావెల్స్, జేఎస్ ట్రావెల్స్, శ్రీనివాస ట్రావెల్స్ ఇవి కర్నూలు కేంద్రంగా ఉన్న ట్రావెల్స్

నిబంధనలకు పాతర..

ఇటీవల వేమూరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనతో అసలు ఈ ట్రావెల్ బస్సుల యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటిస్తున్నాయి? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ప్రయాణికుల ఒకటో, రెండో లగేజీ బ్యాగులు తీసుకెళ్లాల్సిన ట్రావెల్స్ బస్సులు మొత్తం వాణిజ్య సరుకులనే సరఫరా చేస్తున్నాయి. ప్రయాణికుల టికెట్‌తో వచ్చే లాభం కంటే ఈ రవాణా వల్ల వచ్చే లాభం అధికంగా ఉంటుంది. బస్సు కింద ఉండే ట్రావెల్‌లో పైన ఉన్న ప్రయాణికుల కంటే ఎక్కువ లోడ్ వేస్తున్నారు. వీటిలో అగ్ని మాపక శాఖ పరికరాలు కానీ, ఎమర్జెన్సీ డోర్లు కానీ ఉండటం లేదు. దీనికి తోడు అత్యవసర సమయాల్లో అద్దాలు పగలకొట్టేందుకు ఉండాల్సిన చిన్నపాటి సుత్తెలు కూడా అందుబాటులో ఉండటం లేదని గుర్తించారు. ఈ ట్రావెల్ బస్సులన్నీ టూరిస్టు బస్సులుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. కాంట్రాక్టు క్యారేజ్ మాత్రమే తీసుకెళ్లాలి. అంటే ఓ సమూహ ప్రయాణికులను ఓ ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లేందుకు అనుమతులు ఉంటుంది. అయితే వ్యక్తిగత టికెట్లు మాత్రమే వసూలు చేస్తున్నారు.

తనిఖీలో వెల్లడైన నిజాలు..

- కొన్ని బస్సులకు సరైన రికార్డులు లేవు.
- ఎమర్జెన్సీ బటన్ అలారం, డోర్ కూడా ఉండటం లేదు
- వర్షాకాలంలో అద్దాలు తుడిచేందుకు ఉపయోగించే విండ్‌షీల్డ్ కూడా లేవు.
- అత్యవసర అద్దాలు పగులకొట్టే సుత్తెలు, మంటలు ఆర్పే పరికరాలు లేవు.
- ప్రయాణికుల లిస్టు కూడా సరిగ్గా మెయిన్‌టెనెన్స్ చేయడం లేదు
- డ్రైవర్లు అత్యాశతో మధ్య మధ్యలో ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు
- అతివేగంతో వెళ్తున్నట్లు గుర్తించారు.
- సరైన అనుభవం, శిక్షణ ఉన్న డ్రైవర్లను కూడా నియమించుకోవడం లేదు.

మారనీ తీరు..

కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. 19 మంది మృతి చెందిన ట్రావెల్స్ యాజమాన్యంలో కాసింత మార్పు కూడా కనిపించడం లేదు. తమను ఎవరు ఏం చేస్తారనే ధీమాతో నిబంధనలకు పాతర వేసి వాహనాలు నడుపుతున్నారు. గత మూడు రోజులుగా రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తుండగా.. కేసులు నమోదు చేస్తున్నా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. మూడు రోజులుగా రవాణా శాఖ అధికారులు కర్నూలు జిల్లాలోనే 63 కేసులు నమోదు చేశారు.

దాడులు ముమ్మరం చేస్తాం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై నిరంతరం తనిఖీలు చేస్తూనే ఉంటాం. ఎలాంటి అనుమతులు లేకుండా అగ్ని మాపక సహాయ పరికరాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందే. పలుసార్లు తప్పులు చేస్తే వాహనాలు సీజ్ చేసేందుకు వెనుకాడబోం. అనధికారిక ఆల్ట్రేషన్‌తో తిరుగుతున్న రెండు బస్సులను సీజ్ చేశాం. దాడులను మరింత ఉధృతం చేస్తాం. **- శాంత కుమారి, డీటీసీ, కర్నూలు**

విచారణ జరిపి న్యాయం చేస్తాం: ఎస్పీ

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


కర్నూలు క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 135 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులివీ..

కర్నూలులో వీఆర్వో ఉద్యోగం ఇప్పిస్తామని గోనెగండ్లకు చెందిన విశ్వనాథ్ రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు స్టాంటన్‌పురం చెందిన రాచపూడి మనోజ్ ఫిర్యాదు చేశారు. నంద్యాలలో అగ్రికల్చర్ డిపార్టుమెంటులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఆకుల సురేంద్ర రూ.3.10లక్షలు తీసుకుని మోసం చేవాడని నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన ఈడిగ భారతి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వకున్నా ఇచ్చినట్లు రూ.30 లక్షలకు ఇంటిని మార్టగేజ్ చేసినట్లు డాక్యుమెంట్లు తయారు చేసి మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు శరీన్‌నగర్‌కు చెందిన మరియమ్మ ఫిర్యాదు చేశారు. పొలంలోకి రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన ఆనంద్ ఫిర్యాదు చేశారు. కేవీ సుబ్బారెడ్డి కళాశాల, అశోక ఇంజనీరింగ్ కళాశాలకు ఎదురుగా రైల్వే ట్రాక్ అవతల కొందరు ఆకతాయిలు తమ పొలంలో చెట్ల కింద మద్యం సేవించి తర్వాత మద్యం సేవించిన ఖాళీ సీసాలను పొలంలో అక్కడే పడేస్తున్నారని, పొలం పనులకు వచ్చిన కూలీలను బెదిరిస్తున్నారని కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన ఎర్రమల ఫిర్యాదు చేశారు. తన చిన్న కుమారుడు, కోడలు ఆస్తి గురించి గొడవలు పడుతూ వృద్ధాప్యంలో తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు సంజీవనగర్‌కు చెందిన రాములమ్మ ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా కృష్ణమూర్తి బాధ్యతలు


జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్దిని కలిసిన కృష్ణమూర్తి

కర్నూలు లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంటు ప్లీడర్‌గా బి.కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఇన్‌చార్జి జీపీగా బాధ్యతలు నిర్వర్తించిన ఏజీపీ సయ్యద్ శాబుద్దీన్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కృష్ణమూర్తి ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. జిల్లాలోని జిల్లా కోర్టులలో ఆయన ప్రభుత్వం తరుపున తన వాదనలను వినిపిస్తారు. ఆ తర్వాత ఆయన జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్దిని కలిసి పూలబొకే అందించారు. ఆయన పదవి స్వీకరించడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం

- ఏపీఈసీప జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న విశ్వనాథ్‌రెడ్డి

కల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ సవరణ బిల్లు 2025కు వ్యతిరేకంగా తీర్మానించినట్లు ఏపీ ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన ఆల్ ఇండియా విద్యుత్ వినియోగదారుల సంఘం దక్షిణ జోన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ నుంచి 32 మంది సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల్లో వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ బిల్లుతో విద్యుత్ చార్జీలు పెరుగుతాయని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల అమర్చే ఖర్చును ప్రజలపైనే వేస్తారని తెలిపారు. సంస్థపై ప్రభుత్వ నియంత్రణ తగ్గిపోతుందని, విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి ప్రజా ప్రయోజనం కంటే లాభం ముఖ్యమవు గ్రామీణ, పేద వినియోగదారులకు సబ్సిడీలు తగ్గిపోవడం వల్ల విద్యుత్ ధరలు అందరికీ ఒకేలా పెరుగుతాయన్నారు. సేవలో నాణ్యత తగ్గే అవకాశం ఉందన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే బుడ్డా


ఎమ్మెల్యే బుడ్డాకు తిలకధారణ చేస్తున్న ప్రధాన అర్చకుడు

శ్రీశైలం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు తిలకధారణ చేయగా, ఈవో శ్రీనివాసరావు స్వాగతం పలికారు. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో తొలుతగా శివదీక్ష మాలధరణ చేసుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.అమ్మవారి ప్రాకార మండపంలో వేదాశీర్వచనాలు వల్లించి తీర్థప్రసాదాలతో పాటు లడ్డూ, పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు. ఎమ్మెల్యే వెంట ధర్మకర్తల మండలి సభ్యులు భరద్వాజ శర్మ, గుళ్ల గంగమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు ఆకుల శ్రీనివాసులు ఉన్నారు. అలాగే సున్నిపెంటలో రూ. 5కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం


సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

నంద్యాల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు దుర్మార్గమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం గాంధీచౌక్‌లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజల నుంచి కోటి సంతకాల సేకరించి గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, నాయకులు పీపీ నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


మహానందిలో జలహారతి ఇస్తున్న అర్చకులు


రుద్ర కోటేశ్వరాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


గడివేముల: దుర్గాభోగేశ్వర ఆలయంలో ..

ఓం నమఃశివాయ..

- శివ నామ స్మరణతో మారుమోగిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు


ప్రథమ నందీశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

నంద్యాలకల్చరల్/మహానంది/గడివేముల/బండిఆత్మకూరు/ఆత్మకూరు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మారుమోగాయి. మహిళలు ఆలయాలలో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. నంద్యాల పట్టణంలోని పలు శివాలయాలలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంకాలం మహిళా భక్తులు ఆకాశదీపాలను వెలిగించారు. నంద్యాల ప్రథమనందీశ్వరాలయంలో నిత్యాన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జనసేననాయకులు భవనాశి వాసు, భవనాశినాగమహేష్, భక్తులు చలం బాబు, అర్చకులు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహానంది క్షేత్రంలో కార్తీక మెదటి సోమవారం భక్తుల సందడితో నిండిపోయింది. పరమశివుని దర్శించుకున్నారు. మహిళ భక్తులు నాగులకట్ట, ధ్వజస్తంభం వద్ద దీపాలను వెలిగించారు. రాత్రి అత్యంత వైభవంగా అర్చకులు జల హారతి ఇచ్చారు. కాగా, మహానంది క్షేత్రానికి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా పాల పంపిణీ చేశారు. గడివేముల మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని దుర్గాభోగేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ, అర్చకులు గిరిధర్ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బాలత్రిపురాంబసమేత పాలకేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండిఆత్మకూరు మండలం ఓం కారంలో శివనామస్మరణ మార్మోగింది. ఆలయ కమిటీ చైర్మన్ చెన్నారెడ్డి, ఈవో నాగప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమం, ఆర్యవైశ్య సత్రంలో అన్నదానాలు చేశారు. అలాగే మండలంలోని శివనంది, కృష్ణనంది క్షేత్రాలలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ఈవో వేణునాథరెడ్డి విష్ణునందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు మండల పరిధిలోని రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. రుద్రాణిసహిత రుద్ర కోటేశ్వర స్వామి అమ్మవార్లకు ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు గావించారు. క్షేత్రంలోని కల్ప వృక్షం చుట్టూ ప్రదర్శనలు చేసి మహిళలు తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు దేవస్థానం కమిటీ అధ్యక్షులు రాఘవరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


అన్నదానం చేస్తున్నభక్తులు


బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో..



2 నుంచి మంగళ కైశిక ద్వాదశి వేడుకలు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ద్వాదశిని పురస్కరించుకొని పురస్కరించు కొని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో వచ్చేనెల 2నుంచి మంగళ కైశికద్వాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమ వారం నంద్యాల పొన్నాపురం ఎస్‌కాలనీలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణం, పొన్నాపురం, ఆళ్లగడ్డలోని ఆదర్శ అభ్యుదయ నగర్ కాలనీ, వర్కూరు, గూడూరు మండలం పెంచిలకలపాడు గ్రామాల్లోని మంగళకైశిక ద్వాదశి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచారం మండల సభ్యులు వీరాంజనేయరావు, అర్చకులు శేషపాములేటి, రామనరసింహులు, ఎస్సీ సామాజిక ప్రతినిధులు పాల్గొన్నారు.

మనోబంధు ఫౌండేషన్ పోస్టర్ ఆవిష్కరణ

నంద్యాల నూనెపల్లి/టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవని, మంచి కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్పీ సునీల్ షెరాన్, జేసీ కొల్లాబత్తుల కార్తీక్ అన్నారు. సోమవారం వేర్వేరుగా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ కార్యాలయాల్లో మనోబంధు ఫౌండేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నంద్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల, నాగేశ్వరరావు, ఉస్మాన్‌బాషా, సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెరువులో పడి ఎద్దుల మృతి


మృతి చెందిన ఎద్దులు

ఆత్మకూరు రూరల్ , అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు చెరువులో పడి మూడు ఎద్దులు మృతి చెందాయి. ఈ ఘటన ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామ శివార్లలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బుడ్డే సాహెబ్ బండికి రెండు ఎద్దులు, వెనుక మరో రెండు ఎద్దులను కట్టుకుని పొలానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా చెరువు వద్దకు రాగానే పశువులు బెదిరి ఒక్కసారిగా బండితో చెరువు పడ్డాయి. అంతలో బుడ్డేసాహెబ్ తేరుకుని బండికి ఉన్న ఒక ఎద్దు తాడును తీయగలిగాడు. అంతలో మూడు ఎద్దులు నీటిలో మునిగి మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్ సహాయంతో మృతి చెందిన ఎద్దులను బయటకు తీశారు.

ఆవుల సంచారంతో ఇబ్బందులు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహానంది మండలంలోని గాజులపల్లి గ్రామంలోని పొలాల్లో, రోడ్లపై ఆవులు సంచరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఎస్‌డీపీఐ శ్రీశైలం అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆవులు పొలాల్లో సంచరించి పంటలకు నష్టం కలిగిస్తున్నాయన్నారు. రోడ్లపై తిరగడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్‌కలాం, కార్యదర్శి సుల్తాన్, సభ్యులు ఖాజా హుస్సేన్, రఫీ, మజీద్‌ఖాన్, గాజులపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.







నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కరివేన గ్రామంలో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షాలు వల్ల పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరలు కల్పించ కపోవడం వల్ల రైతులు మరింత అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. పాలకులు స్పందించి మొక్కజొన్న రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితురాలికి చెక్కును అందిస్తున్న బైరెడ్డి

నంద్యాల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం నంద్యాల బొమ్మలసత్రంలోని ఎంపీ శబరి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. మొత్తం రూ.4.26 లక్షల చెక్కులను ఆరుగురు బాధితులకు, కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు అండగా నిలుస్తుందన్నారు.

హామీని నెరవేర్చాలి

నందికొట్కూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం గ్రీవెన్స్‌లో వినతిపత్రాన్ని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ నాయకులు సమర్పించారు. అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు తహసీ ల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

అమలాపురం వెళ్లిన విద్యుత్ సిబ్బంది

నంద్యాల కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో దెబ్బతిన్న విద్యుత్ పనులకు సంబంధించి రెక్టిఫికేషన్ కోసం జిల్లా నుంచి 18టీములు డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వెళ్లిన ట్లు సోమ వా రం ఎస్ఈ సుధాకర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలి పారు. విద్యుత్ శాఖ సీఎండీ శివశం కర్ ఆదేశాల మేరకు ఈఈ, ఆరుగురు డీఈఈలు, ఆరుగురులు ఏఈ ఈలు, ముగ్గురు సబ్ ఇంజనీర్లు, 206మంది వర్కర్స్‌ను పంపినట్లు ఎస్ఈ పేర్కొన్నారు.

వన సంరక్షణ సమితి కార్యవర్గం ఎన్నిక

మహానంది, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహానంది వనసంరక్షణ సమితిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీఆర్వో హైమవతి ఆధ్వర్యంలో వీఎస్ ఎస్ కమిటీ అధ్యక్షుడిగా చలం చలం తిరుపతయ్య, ఉపాధ్యక్షురాలుగా మండ్ల పాములేటమ్మ, మరో 15మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చలం చలం శిరీష, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, ఎఫ్‌బీఓ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

'వీవోఏలను తొలగించడం సరికాదు'

నంద్యాల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి) : అన్యాయంగా వీవోఏలను తొలగించడం సరికాదని ఏపీ వీవోఏల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి కోరారు. సో మవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో సంఘం రాష్ట్ర మహాసభను నిర్వహించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, వీవోఏల సంఘ జిల్లా కార్య దర్శి తిరుపతయ్య, వీవోఏలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. లోతట్టు ప్రాంతాలను వీడి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అన్నారు.

నందికొట్కూరు: పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ బేబి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నెంబరు 9059579188ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ముఖ్యంగా మట్టి, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండరాదని, కరెంట్ స్తంభాలకు తాకకూడదన్నారు. తాగునీటిని కాచి తాగాలని ఆమె సూచించారు.

నేటి నుంచి నీటి సరాఫరాలో అంతరాయం

నంద్యాల టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుఫాను కారణంగా ముందస్తు హెచ్చరికగా నంద్యాలలో 27 రాత్రి నుంచి 29 వరకు విద్యుత్తు, నీటి సరాఫరాలో అంతరాయం ఏర్పడనుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాను కారణంగా ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ముందస్తుగా నిల్వ చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న మున్సిపల్ ఆఫీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ 7702776048 ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పంటల కోతలు ఆపాలి

జూపాడుబంగ్లా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా రైతులు మొక్కజొన్న, మినుము, పత్తి పంటకోతలను ఆపాలని సోమవారం మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈనెలాఖరులోగా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అలగే కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే ఈ ఫోను నంబర్లు 9959270845, 7780300061, 7799632424 సంప్రదించాలని సూచించారు.

పంటల సంరక్షణపై సూచనలు

గోస్పాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికవర్షాల నేపథ్యంలో పంటల సంరక్షణపై వ్యవసాయ అధికారి స్వప్నిక, హార్టికల్చర్ అధికారి ధరణి రైతులకు సూచనలు, సలహాలు చేశారు. మిరప పంటను పరిశీలించి పొలంలో నీరు అధికంగా ఉంటే బయటకు పంపాలని సూచించారు. మొక్కల నిలబడేందుకు, తెగుళ్ల నివారణకు రసాయన మందులు పిచికారి చేసుకోవాలన్నారు. వరి పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పడిపోయినచోట కట్టలు కట్టాలన్నారు. మొక్కజొన్న కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. ఏదైనా విపత్తు సంభవించినట్లయితే 112, 1070లకు, లేదా 1800 425 0101టోల్‌ఫ్రీనెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

క్యాన్సర్ నివారణపై ప్రజలకు అవగాహన

మహానంది, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని నోడల్ అధికారి డాక్టర్ కాంతారావు అన్నారు. సోమవారం ఎం.తిమ్మాపురంలోని పీ హెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రికార్డులతో పాటు పరి సరాలను పరిశీలించారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్న వ్యాధిగ్ర స్తులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వేను ప్రారంభించింద న్నారు. వైద్యాధికారి వేణుకార్తికేయ, ఎంపీ హెచ్ఎస్ నరసింహారావు, ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి, పీ హెచ్ఎన్ అమీనాబీ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయం


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి

గడివేముల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో పోలీసు ఆయుధాల ప్రదర్శనను నిర్వహించారు. పోలీసు శాఖలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రత పరికరాలు, కమ్యూనికేషన్ సిస్టమ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భవనాశి వాగులో చిక్కుకున్న వాహనం

పాములపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇస్కాల గ్రామ శివారులోని భవనాశి వాగులో సోమవారం బొలేరో వాహనం చిక్కుకుంది. ఇటీవల తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీవర్షాల వల్ల ఎగువ నల్లమల అటవీప్రాంతం నుంచి వర్షపు నీరు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు మొంథా తుఫాన్ నేపథ్యంలో మండల అధికారులు ప్రజలు వాగులు దాటకుండా తలారులను కాపలాగా ఉంచారు. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఒడ్డున ఉన్న నందీశ్వర ఆలయంలోకి వర్షపునీరు చేరింది.

పిన్నాపురంలో వైద్య శిబిరం

పాణ్యం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నాపురంలో గ్రీన్‌కో ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో గ్రామస్థులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లాలూ యాదవ్, సర్పంచ్ వెంకటకృష్ణుడు, గ్రీన్‌కో మేనేజరు శివప్రసాద్, హెచ్ఎం సుమియోన్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

పాణ్యం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడాలని ఎంఈవో సుబ్రహ్మణ్యం కోరారు. సోమవారం మండలంలోని అన్ని పాఠశాలలకు మొక్కల పంపిణీ చేశారు. ప్రపంచంలో విచక్షణా రహితంగా ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థికి మొక్కల సంరక్షణ బాధ్యత అప్పగించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ


రిహాన్

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పట్టణానికి చెందిన రిహాన్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 24నుంచి 27వరకు ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమిలో యోనెక్స్ సన్‌రైజ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-13విభాగంలో పాల్గొని రిహాన్ రన్నరప్‌గా నిలిచారు. ప్రతిభ చూపిన విద్యార్థిని నోటరీ పాఠశాల కరస్పాండెంట్ బి.వి.స్పుయ్య ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో రిహాన్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పాఠశాలకు సర్వీసు రోడ్డు వేయాలి

పాణ్యం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయానికేతన్ పాఠశాలకు సర్వీసు రోడ్డు వేసుకోవాలని ప్రజా సంఘాల నాయకుడు ప్రతాప్ కోరారు. సోమవారం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ప్రహరీ లేకపోవడంతో జంతువులు, వాహనాలు విచ్చలవిడిగా క్రీడామైదానంలోకి వస్తూ విద్యార్థుల క్రీడలకు ఆటంకం కలుగుతుందన్నారు.

ఆకుమచ్చ తెగులు నివారించుకోవాలి

పాములపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పసుపు పంటను ఆశించే ఆకుమచ్చ తెగుళ్లను సకాలంలో నివారించుకొని అధిక దిగుబడులు పొందాలని హార్టికల్చర్ అధికారి చందన సూచించారు. సోమవారం బనకచెర్లలో పసుపు పంటను పరిశీలించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రక్త దానం చేయండి: డీఎస్పీ



రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. సోమవారం స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా టౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రమోద్ ప్రారంభించి మాట్లాడారు. పోలీసు అమర వీరుల త్యాగాలు మరవలేనివన్నారు. ముందుగా డీఎస్పీ ప్రమోద్ రక్త దానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్, సబ్‌డివిజన్ లోని ఎస్‌ఐలు, పోలీసులు, యువకులు రక్తదానం చేశారు. రక్త దాన శిబిరాన్ని విజయవంతం చేసిన స్టేట్ రెడ్ క్రాస్ సోసైటీ సిబ్బందికి ఆళ్లగడ్డ పోలీసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

GENERAL NOTICE

అందరికీ తెలియపరచడం ఏమనగా మా క్లైంటులు Shriram Finance Ltd. Bethamcharla Branch వారు ఈ క్రింద కనపరిచిన షెడ్యూలు Property ని Mortgage చేసుకొని **Sri Dudekula Ravi Kullai S/o Dudekula Chinna Kullai** అను వారికి లోన్ ఇవ్వచున్నారు. కావున ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల 7 రోజులలో తెలుపవలెను.

SCHEDULE OF THE PROPERTY

The part and parcel site situated in Nandyala Registration district, Banaganapalli Sub Registration district, in Surve bearing no **153/2B,** 12th ward,of Banumukkala village and Banaganapalli Grama panchayathi limits and mandal, Nandyala district.

Measurements : East-West : Northern side:42 5/12 feet, Southern side side:42 5/12 feet, North - South : Eastern side:41 5/12 feet, Western side:42 5/12 feet Total : **198.33** Sq.yards. **Boundaries : East :** Dr Attar Hameed Hussen site, **West :** Road, **North :**25 feet Road, **South :** Venkateswara reddy and others land.

G.Madhusudhana Rao
Advocate, Dhone, Kurnool.

కార్తీక పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఆళ్లగడ్డ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వకుళా నది వడ్డున వెలసిన రెండో కాశీగా పిలువబడే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాసింతలలో సోమవారం కార్తీక శోభ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిట లాడింది. ఈ సందర్భంగా అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వరస్వామికి భక్తులు వకుళా నది జలాలతో అభిషేకం చేసి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా గ్రామాల్లో కార్తీక మాసం మొదటి సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు తెల్లవారు జామునేలేచి స్థానిక కుందూనదిలో దీపాలు వదిలేశారు. ఉయ్యాలవాడ, ఇంజేడు, మాయలూరు, అల్లూరు, కొండుపల్లె, హరివరం, నర్శిపల్లె తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు.

బనగానపల్లె: పట్టణంలోని నాలుగు స్తంభాల గుడిలోని భవాని ఈశ్వర మార్కాండేయ స్వామి ఆలయంలో సోమవారం కార్తీక మహోత్సవాలు నిర్వాహకుడు కోట చిన్నవెంకట సుబ్బరాయుడు ఆధ్వ ర్యంలో ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామివారికి అభి షేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించారు. అలాగే మండలంలోని పలుకూరు రామేశ్వర ఆల యంలో పూజారి బాస్కరయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం మహిళలు ఆకాశ దీపాలు వెలిగించారు.

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర, భైరవీశ్వర, మలయచల మల్లేశ్వర, గృహ మద్దిలేటి స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేసి, దీపాలు వెలిగించారు. కోదండరామాలయంలో మహిళలు సామూహికంగా ఈశ్వరస్వామికి బిల్వపూజ నిర్వహించారు. 108 దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయాల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని వాసాపురం, రుద్రవరం, యల్లావత్తుల, చందలూరు, ఆలమూరు గ్రామాల్లో సోమవారం ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు ఈశ్వరుడు, పార్వతీ దేవికి పూజలు చేశారు.

ప్యాపిలి: పట్టణంలోని ఈశ్వరస్మామి, నీలకంఠేశ్వరస్వామి, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాల్లో కార్తీక మాసం మొదటి సోమ వారం మహిళలు పూజలు చేశారు. అనంతరం ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు శివుడికి అభి షేకాలు నిర్వహించారు.

అవుకు: పట్టణంలో వెలసిన కాశీవిశ్వనాథస్వామి, చెర్లోపల్లె గ్రామ సమీపంలో వెలసిన బుగ్గమల్లేశ్వరస్వామి, శివవరం గ్రామంలోని శివాలయాల్లో అర్చకులు శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. మహిళలు ఇంటి ముందు దీపాలు వెలిగించారు. శివాలయాలకు తరలివెళ్లి శివపార్వతులకు కాయకర్పూరం సమర్పించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని నేలబిళం మల్లేశ్వరస్వామి, కొలిమిగుండ్ల లలితాసుందరేశ్వరస్వామి, పేట్నికోట విశ్వేశ్వరస్వామి, గుం డు మల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు నిర్వహించారు. బెలుం సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పంచదార అభిషేకాన్ని నిర్వహించినట్లు అర్చకులు మహేష్‌స్వామి వెల్లడించారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పలు కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా స్వామివారికి పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల పల్లకీసేవ నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి అయ్యప్ప భక్తులు పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.






ఉయ్యాలవాడ, అవుకు, వాసాపురం, ప్యాపిలి శివాలయాల్లో పూజలు చేస్తున్న భక్తులు



ఆళ్లగడ్డ: కాసింతల క్షేత్రంలో భక్తుల రద్దీ




కొలిమిగుండ్ల: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చాగలమర్రిలో..





పోలీసు అమరవీరుల త్యాగాలు మరవలేనివి

ప్యాపిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరులైన పోలీసుల త్యాగాలు మరవలేనివని ఎస్ఐ మధుసూదన్ అన్నారు. పోలీసు అమరవీ రుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల దినంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమి స్తారన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనపరిచిన బాలికలకు ఎస్ఐ మధుసూదన్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసులు, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థినులు

బనగానపల్లె: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బనగానపల్లె పట్టణంలో సోమవారం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు దుగ్గిరెడ్డి, కల్పన ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, తుపాకులు ఎలా వాడాలి, పిస్టల్ వాటి విడిభాగాల గురించి వైర్‌లెస్ సెట్ గురించి కేసులు గురించి , ఖైదీల సెల్‌ల గురించి వారు అవగాహన కల్పించారు.

యాగంటిలో పల్లకీ సేవ

బనగానపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యాప్ ద్వారా నకిలీ మద్యాన్ని కనుగొనవచ్చు

డోన్ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యాప్ ద్వారా నకిలీ మద్యాన్ని కనుగొనవచ్చని టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేం ద్రగౌడు అన్నారు. సోమవారం పట్టణంలోని తారకరామనగర్ బాలాజీ వైన్‌షాపు వద్ద ప్రజలకు అవగాహన కల్పించేందుకు మద్యం తెలుసుకునే విధానంపై ప్రజలకు సెల్ ఫోన్ డెమో ద్వారా అవగాహన కల్పించారు. గుండాల జయరాముడు, టైలర్ ఖాజా, సంజీవుడు, ధను పాల్గొన్నారు.

ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

బనగానపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకలాపురం గ్రామంలో రూ.28 లక్షలతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, టీడీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి భూమి పూజ చేశారు. త్వరితగతిన ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి గ్రామంలో తాగునీటి సమస్యలేకుండా చేస్తామని ఏఈ తెలిపారు. టీడీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఆర్.రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

దొర్నిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగ్యన గరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు కొప్పరపు హర్షవర్ధన్ తండ్రి కొప్పరపు శ్రీరాములు (75) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, మండల టీడీపీ సెక్రటరీ కొత్తపల్లి సురేంద్రలు అక్కడికి వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమా జగత్ విఖ్యాతరెడ్డి మాట్లాడుతూ శ్రీరా ములు మృతి విచారకరమని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.



నివాళి అర్పిస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కీడల్లోనూ రాణించాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి అవుట్‌డోర్ స్టేడియంలో పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ ఆధ్వర్యంలో డోన్ డివిజన్ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరై ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా తీసు కోవాలన్నారు. పాతపేట పాఠశాలకు క్రీడా మైదానం లేక ఇబ్బందులు పడు తున్నామని, పక్కనే ఉన్న అటవి భూమి స్థలాన్ని సంబంధిత వారితో మా ట్లడి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయించాలని హెచ్‌ఎం పద్మావతమ్మ కోట్ల సుజాతమ్మ దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్య గౌడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు, నాయకులు ఓంప్రకాష్, ఆలేబాదు పరమేష్, పీఏసీఎస్ చైర్మన్ చిన్నపూజర్ల ఎల్లగౌడు, నంద్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆశాజ్యోతి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి రవికుమార్, సీనియర్ ఉపాధ్యాయుడు ఎంఎస్ బాబు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

డోన్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి జి.కళ్యాణి అన్నారు. సోమవారం ఉద్యాన శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చీని, మామిడి, అరటి, మిరప, ఉల్లి పంటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు ఉద్యాన శాఖాధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా శ్రీనివాస్ యాదవ్

ఆళ్లగడ్డ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఆవనగండ్ల శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు. సోమవారం స్థానిక ఓబీసీ కార్యాలయంలో అఖిలభారత ఓబీసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరప్రసాద్ శ్రీనివాసన్ యాదవ్‌కు నియమిత ఉత్తర్వులను అందజేశారు. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తనను జాతీయ కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షుడుకి కృతజ్ఞాతలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి దాతలు రూ.25 వేలు విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికు అందించారు. బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి చెందిన పన్నీరు శేషయ్య, సుప్రజ దంపతులు చైర్మన్‌కు అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థులు..

సంజామల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009 లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాలకు మైక్‌సెట్ కోసం రూ. 10వేల విరాళాన్ని అందజేశారు. సోమవారం హెచ్‌ఎం షబ్బీర్ హుసేన్‌కు పాఠశాలలో పూర్వవిద్యార్థులు వినోద్, అఖిల్ మైక్ సెట్ కోసం రూ. 10వేలు అందజేశారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి: తహసీల్దార్

బేతంచెర్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కార్డుల పంపిణీని ఈ నెలా ఖరులోగా పూర్తి చేయాలని తహసీల్దార్ నాగమణి డీలర్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మారుతి డీలర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ చౌక దుకాణాదారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం: డీఎస్పీ

దొర్నిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హెల్త్ అండ్‌వెల్త్ ఫైనా న్సియల్ కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులకు న్యాయం చేస్తామని డీఎస్పీ ప్రమోద్ అన్నారు. ఆ కంపెనీలో దాదాపు 1,000 మంది దాకా రూ.3.50 లక్షలు కట్టి వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా నెలకు రూ.40వేలు జీతాలు చెల్లిస్తామని దొర్నిపాడుకు చెందిన బాసిరెడ్డి వీరారెడ్డి, అతడి అల్లుళ్లు రాజా రెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించారన్నారు. దీంతో వారిని అరెస్టు చేసి వారి అకౌంట్‌ల్లోని రూ.9కోట్లు సీజ్ చేశామన్నారు.

నీట మునిగిన చెత్తసంపద కేంద్రం పరిశీలన

ప్యాపిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామంలో చెత్తసంపద కేంద్రం నీట మునిగింది. సోమవారం డిప్యూటీ ఎంపీ డీవో ప్రభాకర్ నీట మునిగిన చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు మళ్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల/ఆళ్లగడ్డ/ చాగలమర్రి/ రుద్రవరం/ బేతంచెర్ల/సంజామల అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు మొంథో తుఫాన్‌తో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆళగడ్డ సీఐ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మట్టి మిద్దెలు, పూరాతన ఇళ్లు, పూరి గుడిసెల్లో నివాసం ఉండరాదని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ప్రజలకు సూచించారు. విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని, నది పరివాహక లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయాలని అన్నారు.

బ్లాస్టింగ్‌ను ఆపాలి

బనగానపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామంలోని కొత్తపేట వీధి సమీపంలో ఇళ్ల పక్కనే అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్నారని, దానిని ఆపాలని పలుకూరు వాసులు సోమవారం బనగానపల్లె పట్ట ణంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నారాయణరెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. కొత్తపేట వీధిలో వంద కుటుంబాలు నివసిస్తున్నాయని, ప్రస్తుతం 164/2 సర్వే నంబరులో గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, తులసిరెడ్డిలు ఇళ్ల పక్కనే మైనింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీని వల్ల ఇళ్లు పగుళ్లు ఇస్తున్నాయని ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు చిన్నకేశాలు, గొల్లసుబ్బ రాయుడు, మద్దయ్య, నాగేశ్వరరావు, జయమ్మ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

కొలిమిగుండ్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్ బాబు అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల హైస్కూల్‌లో పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసుల ఆయుదాల ప్రదర్శనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం కొండప్ప, రమణయ్య, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

మందలూరులో కూలిన మట్టిమిద్దె

రుద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలూరు గ్రామంలో కురుస్తున్న వర్షాలకు మట్టిమిద్దె కూలింది. రమేశ్ కు చెందిన మట్టిమిద్దె సోమవారం కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పింది.

బనగానపల్లె: కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని భానుముక్కల వీధికి చెందిన మిట్టపల్లె వెంకటరెడ్డికి చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. సోమవారం బనగానపల్లె తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తన మట్టిమిద్దె కూలిపోయినట్లు తహసీల్దారుకు బాధితుడు వినతి పత్రం అందించారు.